క్లుప్తంగా

వైభవంగా శివాలయాల్లో ఆరుద్రోత్సవం



ఫిరంగిపురం: మండలంలోని పలుగ్రామాల్లోని శివాలయాల్లో బుధవారం ఆరుద్రోత్సవాన్ని పురస్కరించుకొని విశేష శివపూజలు, అభిషేకాలు నిర్వహించారు. మండల కేంద్రంలోని నగరేశ్వరుడి ఆలయంలో అర్చకులు రాజేంద్ర శర్మ, స్వామికి అభిషేకం నిర్వహించి అన్నాభిషేకం చేశారు. కాళహస్తీస్వరాలయంలోను, వేములూరిపాడులోని జలపాలేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు స్వామివారికి విశేష పంచామృతస్నపన కార్యక్రమాలు నిర్వహించారు. నుదురుపాడులోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వేమవరంలోని విశ్వనాథ ఆలయం, 113తాళ్లూరులోని శివాలయాల్లో విశేష అర్చనలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో త్వరలో బస్ యాత్ర

తాడేపల్లిరూరల్: ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో బస్ యాత్ర నిర్వహించనున్నట్లు ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు జాఫర్ ఆలీ అన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ముస్లిం ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ముస్లిం ఐక్యవేదిక బస్సులో 14 మంది సభ్యులు, ఒక బస్సుతో పాటు రెండు కార్లలో రాష్ట్ర పర్యటన చేయనున్నామని తెలిపారు. సమావేశంలో నాయకులు అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నూర్ ఖాన్, బాపట్ల జిల్లా ప్రెసిడెంట్ మౌలా బేగ్, యూత్ అధ్యక్షులు మహమ్మద్ అన్సర్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అబ్దుల్ రెహమాన్, ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం, అబ్దుల్లా, సలావుద్దీన్, అహ్మద్, సయ్యద్ కాజా, నసీమా సుల్తానా, హాజీ హుస్సేన్, అబ్దుల్ అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల విద్యపై అవగాహన



తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విద్యార్థులకు బుధవారం మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో బాలికల విద్యపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆత్మకూరులోని కొబ్బరిచెట్ల పాలెం, వడ్డెరపాలెం తదితర ప్రాంతాల్లో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పర్యటించి బాలికల విద్యా ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ సిహెచ్.హనుమంతరావు మాట్లాడుతూ బాలికలు విద్యావంతులైతే వాళ్లు తమ స్వశక్తిపై ఆధారపడడంతో పాటు భవిష్యత్‌లో ఒక కుటుంబాన్ని విద్యావంతులను చేస్తారని అన్నారు. వర్సిటీ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగాధిపతి డాక్టర్ గంధర్వ స్పైన్ మాట్లాడుతూ బాలికలు విద్యావంతులైతే ఆత్మస్థైర్యంతో పాటు కుటుంబ పోషణకు ఆధారంగా ఉంటారని అన్నారు.

రాజశ్యామల యాగంలో పాల్గొన్న శివస్వామి



తాడికొండ: తాడికొండలోని భవానీపీఠంలో నిర్వహిస్తున్న శ్రీరుద్ర సహిత రాజశ్యామల యాగానికి బుధవారం శైవక్షేత్ర పీఠాధిపతి శివస్వామి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు పీఠం వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జరిగిన యాగంలో శివస్వామి విశేష పూజలు నిర్వహించారు. పీఠ వ్యవస్థాపకులు కొల్లిపర నాగకోటేశ్వరశర్మ దంపతులు స్వామిజీని ఘనంగా సత్కరించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



తాడేపల్లిరూరల్: దుగ్గిరాలలోని ఉప ఖజానా కార్యాలయంలో బుధవారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో క్యాలెండర్‌ను ఉప ఖనాజాధికారి షేక్ మస్తాన్ గుంషావలి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దుగ్గిరాల తాలూకా యూనిట్ అధ్యక్షులు అందె బాలచంద్రమౌళి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఏపీజీఈఏ క్యాలెండర్‌ను ఆవిష్కరించి అందజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఏపీజీఈఏ సహాధ్యక్షులు గుంటూరు పూర్ణ ప్రసాద్, వంకాదర సుబ్బారావు,సంయుక్త కార్యదర్శి బొల్లంపల్లి బుజ్జి, ట్రెజరీ సిబ్బంది రాము పాల్గొన్నారు.

ఉత్కంఠగా ఆడుదాం ఆంధ్రా పోటీలు



ఉండవల్లిలో కబడ్డీ ఆడుతున్న యువకులు



నిడమర్రులో క్రీడాకారులను అభినందిస్తున్న కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ హేమమాలిని

తాడేపల్లిరూరల్: మంగళగిరి- తాడేపల్లి నగర పాలక సంస్థ, దుగ్గిరాల మండల పరిధిలో ఉన్న 83 సచివాలయాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా క్రీడాల్లో పాల్గొన్న యువతీ యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మంగళగిరి రూరల్ పరిధిలోని నిడమర్రులో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కబడ్డీ పోటీలను కార్పొరేషన్ అడిషనల్ కమిషనర్ హేమమాలిని ప్రారంభించారు. ఉండవల్లి దేవాలయ భూముల్లో నిర్వహించిన కబడ్డీ పోటీలను డెప్యూటీ కమిషనర్ బిక్కిరెడ్డి శివారెడ్డి, సెక్రటరీ రాధాకుమారి ప్రారంభించారు. దుగ్గిరాల మండల పరిధిలో ఎంపీడీఓ డి.వీరయ్య ఆటల పోటీలను ప్రారంభించారు. మిగిలిన సచివాలయాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొని కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ పోటీల్లో సచివాలయాల వారీగా రెండో రోజు కూడా కబడ్డీ పోటీలు కొనసాగాయి. మహిళలు కబడ్డీ ఆడేందుకు ముందుకు వచ్చి తమ ప్రతిభను చాటుకున్నారు. ఉదయం 10 గంటకు ప్రారంభమైన కబడ్డీ పోటీలు సాయంత్రం వరకు కొనసాగాయి. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ హేమమాలిని మాట్లాడుతూ క్రీడలు అనేవి మానసిక ఉల్లాసంతో పాటు శరీర దృఢత్వం పెంచుతుందని, క్రీడల్లో ప్రతిభకనబర్చిన వారికి మంచి అవకాశాలు వస్తాయని చెప్పారు.

మేడికొండూరులో..

మేడికొండూరు: విద్యార్థులకు ఆరోగ్యంతో పాటు ఆనందాన్ని ఇవ్వడానికి ఆటల పోటీలు ఎంతగానో దోహదపడతాయని పంచాయతీ కార్యదర్శులు బండెల రమేష్, రెహమాన్ పేర్కొన్నారు. మండల పరిధిలోని పేరేచర్ల ఎస్‌జీవీఆర్ ఉన్నత పాఠశాలలో ఆడుదాం- ఆంధ్రా ఆటల పోటీలు రెండో రోజు బుధవారం కొనసాగాయి. వారు మాట్లాడుతూ పోటీ ప్రపంచంలో విద్యతో పాటు క్రీడలు ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డోకిపర్రు సచివాలయ సిబ్బంది కొప్పుల దివ్య, శర్వాణి, షర్మిల, ధనుంజయ్‌రావు, లక్ష్మి, సురేష్, సామ్రాజ్యం, సాంబశివరావు, తిరుమల పాల్గొన్నారు.

నాణ్యమైన వైద్యం అందించడమే జగనన్న లక్ష్యం

ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను అందజేస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు, గంజి చిరంజీవి

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడిలా పరిపాలన సాగిస్తున్నారని, ఆనాడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేద ప్రజలకోసం ఆరోగ్యశ్రీ తీసుకొస్తే, ప్రస్తుతం వైద్యరంగ విధానంలో పెను మార్పులు తీసుకువచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రికి తగ్గ తనయుడుగా నిలిచారని ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గంజి చిరంజీవి పేర్కొన్నారు. ఎంటీఎంసీ పరిధిలోని గణపతినగర్, ఇందిరానగర్‌లో లబ్ధిదారులకు ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను బుధవారం పంపిణీ చేశారు. అనంతరం స్మార్ట్‌కార్డు బ్రోచర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం కార్పొరేట్ వైద్యం అందిస్తుందని, దీనిలో భాగంగా ఆరోగ్యశ్రీ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టారని, ఈ కార్డును కుటుంబ సభ్యులు ఉపయోగించుకుని ప్రతి ఒక్కరూ ఉచితంగా వైద్యసేవలు పొందవచ్చని చెప్పారు. ప్రతి కార్డుకు ఒక క్యూఆర్ కోడ్ పొందుపరచబడి ఉంటుందని అన్నారు. 3257 చికిత్సలకు గాను 2285 చికిత్సలను ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులలో పొందవచ్చని తెలిపారు. ఏ పేదవాడు కూడా వైద్యం కోసం అప్పుల పాలు కాకూడదని, ఆరోగ్యశ్రీ కింద వైద్య ఖర్చులకు 5 లక్షల రూపాయలు గతంలో ఉండగా దానిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 25 లక్షలకు పెంచారని వెల్లడించారు. కార్యక్రమంలో ఇందిరానగర్, మార్కండేయ కాలనీ యూపీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పి.అనూష, డాక్టర్ ప్రియాంక, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, ఆరోగ్యశ్రీ నియోజకవర్గ టీం లీడర్ శెట్టి బాలస్వామి, హెల్త్ సెంటర్ సూపర్‌వైజర్ జయలక్ష్మి పాల్గొన్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేద్దాం

ప్రత్తిపాడు ఎమ్మెల్యే, తాడికొండ సమన్వయకర్త మేకతోటి సుచరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

తాడికొండ: ఈనెల 30వ తేదీ నిర్వహించనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత కోరారు. గుంటూరులోని ఆమె కార్యాలయంలో నాలుగు మండలాల ఎంపీపీలు, జెడ్పీటీసీలు సభ్యులు, పార్టీ మండల అధ్యక్షులు, పలువురు ముఖ్యనాయకులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చిన హామీలు, ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించి అధిక సంఖ్యలో శ్రేణులు సామాజిక సాధికార బస్సు యాత్రకు హాజరయ్యేలా చూడాలన్నారు. అందరూ సమష్టిగా పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రణాళికా బద్ధంగా ముందుకు వెళ్లాలన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర బస్టాండ్ వరకు కొనసాగుతుందని చెప్పారు. అక్కడ బహిరంగ సభ ఏర్పాటు చేసినట్లు వివరించారు.

భక్తిశ్రద్ధలతో శివ ముక్కోటి



బృంగి వాహనంపై గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరస్వామి

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శివ ముక్కోటి పర్వదినాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారు ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లవారుజామున స్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. అనంతరం బృంగి వాహనంపై గంగా భ్రమరాంబ సమేతుడైన మల్లేశ్వరస్వామి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తులకు ప్రసాదాలు పంపిణీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామి దేవస్థానంలో శివ ముక్కోటి సందర్భంగా భగీరథ ట్రస్ట్, గంగా భగీరథ సంఘం ఆధ్వర్యంలో బుధవారం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు, కర్నాటి శివ సత్యనారాయణ, జూట్రు ఏడుకొండలు, రెడ్డి రాఘవ, నంద్యాల గోపాలకృష్ణ, దేవస్థానం మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యుడు అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, వల్లంశెట్టి విజయ్ పాల్గొన్నారు.

ఓబీసీల రిజర్వేషన్లు వ్యతిరేకించడం సిగ్గుచేటు



సమావేశంలో మాట్లాడుతున్న కేసన శంకరరావు

నెహ్రూనగర్: ఓబీసీల స్థితిగతులు మెరుగుపడాలంటే కుల జనగణనే పరిష్కార మార్గమని, 2010లో లోక్‌సభలో ప్రతిపక్ష పార్టీ హోదాలో బీజేపీ అధికారంలోకి వస్తే కులగణన చేపడతామని వాగ్దానం చేసి ప్రస్తుతం తెరవెనక ఆర్ఎస్ఎస్, బీజేపీ మండల్ పేరుతో ఓబీసీ రిజర్వేషన్లు వ్యతిరేకించడం సిగ్గుచేటని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకర రావు మండిపడ్డారు. ఈ మేరకు బుధవారం చుట్టుగుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలు తొలగిపోవాలంటే కుల గణన ఒకటే పరిష్కార మార్గమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట ప్రణాళికలు రూపొందిస్తున్న నేపథ్యంలో బీజేపీ అగ్ర నాయకులు ఓబీసీ రిజర్వేషన్లు వ్యతిరేకిస్తూ ఉత్తర భారత దేశంలో పాదయాత్ర చేపట్టడం బాధాకరమన్నారు. 2024 ఫిబ్రవరిలో జరిగే పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లోనైనా ఓబీసీ జనాభా కుల గణన చేయాలని లేనిపక్షంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి తగిన బుద్ధి చెప్తామన్నారు. సంఘ నాయకులు కుమ్మర క్రాంతి కుమార్, పారేపల్లి మహేష్, కొల్లూరి హనుమంతరావు, కొల్లికొండ వెంకట సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎంహెచ్‌పీఎస్ నియోజకవర్గ కమిటీ నియామకం



తాడేపల్లిరూరల్: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) మంగళగిరి నియోజకవర్గ కమిటీని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఫారూక్ షిబ్లీ, షేక్అక్రమ్ బుధవారం ప్రకటించారు. మంగళగిరిలో ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఎంహెచ్‌పీఎస్ నియోజకవర్గ కమిటీ వివరాలు వెల్లడించారు. గౌరవ అధ్యక్షుడిగా ఎస్‌కే అల్తాఫ్, అధ్యక్షుడిగా ఎస్‌కే హనీఫ్‌షా ఖాద్రి, ఉపాధ్యక్షులుగా సయ్యద్ రసూల్, ఎస్‌కే బాజి, జనరల్ సెక్రటరీగా హజ్రత్ ఆలీ, సెక్రటరీగా ఎస్‌కె ఇమామ్ హుస్సేన్, జాయింట్ సెక్రటరీలుగా ఎస్‌కె ఖాజా మొహిద్దీన్, ఎస్‌కె లాల్ అహ్మద్, కోశాధికారిగా ఎస్‌కే అక్బర్ బాషా, ఈసీ మెంబర్లుగా ఎస్‌కె యాసిన్, ఎస్‌కె బాషా, ఎస్‌కె షరీఫ్, ఎస్‌కె ఆరిఫ్ పాషాలను నియమించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మౌలానా హుస్సేన్ అహ్మద్, రాష్ట్ర సలహాదారులు ఎస్‌కె షాహీద్ పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యదర్శిగా షేక్ అక్రమ్..

తాడేపల్లిరూరల్: మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శిగా షేక్ అక్రమ్‌ను, నియోజకవర్గ అధ్యక్షులు షేక్ హనీఫ్‌షా ఖాదరి నియమిస్తున్నట్లు మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ తీర్మానం చేశారు. బుధవారం ఈ మేరకు మంగళగిరి స్థానిక ప్రెస్ క్లబ్‌లో జరిగిన మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి మంగళగిరి నియోజకవర్గ కమిటీ ఏర్పాటు సమావేశంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి నూతన రాష్ట్ర కార్యదర్శి షేక్ అక్రమ్‌కు, నియోజకవర్గ నూతన అధ్యక్షులు షేక్ హనీఫ్‌షా ఖాదరి నియామక పత్రాన్ని అందజేశారు.

నేడు హుండీ కానుకల లెక్కింపు

తాడేపల్లిరూరల్: మంగళగిరి పట్టణ పరిధిలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానానికి సంబంధించి ఎగువ, దిగువ సన్నిధిలోని హుండీ కానుకలను గురువారం లెక్కించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎ.రామకోటి రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదేవిధంగా శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలోకానుకలు, మొక్కుబడుల హుండీలను ఉదయం 9 గంటలకు లెక్కించనున్నట్లు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గుంటూరు ఈస్ట్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చుట్టుగుంట సెంటర్‌లో ఈనెల 18వ తేదీన సుమారు 55 సంవత్సరాల వ్యక్తి అపస్మారక స్థితిలో పడి ఉండటం గమనించిన స్థానికులు జీజీహెచ్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సమాచారం తెలిసిన వారు 8688831336 నంబరుకు సమాచారం అందించాలని కోరారు.

స్పర్శలేని మచ్చలను గుర్తించాలి

ఫిరంగిపురం: శరీరంపై స్పర్శలేని మచ్చలు, రాగి వర్ణం కలిగిన మచ్చలు ఆరోగ్యసిబ్బంది గుర్తించాలని ఫిరంగిపురం పీహెచ్‌సీ వైద్యులు పి.ఎస్తేరు రాణి అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ఎల్‌సీడీసీ(లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించే కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఇంటింటికి ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు వెళ్లి ఇంటిలోని ప్రతి ఒక్కరి వివరాలు అడిగి తెలుసుకుంటారని చెప్పారు. మందమైన మెరిసే జిడ్డు గలిగిన చర్మం ఉండటం, చెవులపై, వీపుపై బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం, ముక్కుదిబ్బడ, ముక్కు నుంచి రక్తం కారుట, కాళ్లు, చేతులు తిమ్మిర్లు, అరచేతులు, అరికాళ్లలో స్పర్శలేకపోవడం వంటి లక్షణాల ద్వారా కుష్ఠువ్యాధి గ్రస్తులను గుర్తించవచ్చని తెలిపారు. పై అనుమానిత లక్షణాలు ఉన్న వారిని సంబంధిత ఉన్నతాధికారులకు తెలియజేస్తామని వారికి పరీక్షలు చేసి మందులు అందజేస్తారని చెప్పారు. కార్యక్రమం బుధవారం నుంచి జనవరి 12 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ పి.వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి, హెచ్ఎస్ కొండపల్లి సుదర్శనరాజు పాల్గొన్నారు.

వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు నాలుగు రోజుల గడువు

నెహ్రూనగర్: వడ్డీ లేకుండా ప్రస్తుత అర్ధ సంవత్సరానికి ఆస్తి పన్ను చెల్లించడానికి నాలుగు రోజులు (28,29,30,31 తేదీలు) మాత్రమే గడువు ఉందని, పన్ను చెల్లింపుదార్లకు అనుకూలంగా క్యాష్ కౌంటర్లు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాయని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలియచేశారు. 2023–24 రెండో అర్ధ సంవత్సరానికి వడ్డీ లేకుండా పన్ను చెల్లింపునకు ఈ నెలాఖరు వరకే గడువు ఉందని, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం, సర్కిల్ కార్యాలయాల్లోని క్యాష్ కౌంటర్లతో పాటు అదనంగా నగరంలోని భారత్ పేట 140 సచివాలయం, వసంతరాయపురం 148 సచివాలయం, పెద్ద పలకలూరు రోడ్ లోని 106 సచివాలయాల్లో కూడా పన్ను చెల్లించడానికి ప్రత్యేక క్యాష్ కౌంటర్లు ఏర్పాటు చేశామన్నారు. డిసెంబర్ 31 ఆదివారం చివరి రోజు కనుక సెలవు రోజు అయినప్పటికీ క్యాష్ కౌంటర్లు యథావిధిగా పని చేస్తాయన్నారు. నగర పాలక సంస్థకు చెల్లించవలసిన ఆస్తి పన్ను, నీటి పన్ను, ఖాళీ స్థలం పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించాలని కోరారు.

- నగరపాలక సంస్థ సచివాలయ కార్యదర్శులు పన్ను బకాయిదార్లకు ప్రత్యేక స్లిప్ లను అందించాలని, ఫోన్ల ద్వారా ప్రత్యేక కౌంటర్లు, క్యాష్ కౌంటర్ల సమయం గూర్చి సమాచారం ఇవ్వాలన్నారు. 31 తర్వాత బకాయిదార్లకు నీటి కుళాయిలు, అత్యవసర సేవల నిలుపుదల నోటీసులు, ఆర్.ఆర్.యాక్ట్ ద్వారా బకాయిల వసూళ్లకు నోటీసులు సిద్ధం చేయాలన్నారు. పన్ను వసూళ్లు 50 శాతం వసూళ్లు చేయని అడ్మిన్ కార్యదర్శులు, ఆర్ఐ, ఆర్ఓలను టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తామన్నారు.

మినిస్టీరియల్ స్టాఫ్ బాధ్యతాయుతంగా పని చేయాలి

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆసుపత్రిలో పనిచేసే ప్రతి మినిస్టీరియల్ స్టాఫ్ బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ సూచించారు. బుధవారం శుశృత హాలులో మినిస్టీరియల్ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ కొంతమంది ఉద్యోగులు పనిభారంగా మారుతుందని, మార్పులు, చేర్పులు చేయాలని కోరుతున్నారని వారి సమస్యలను త్వరలోనే పరిష్కరించే విధంగా కృషి చేస్తామన్నారు.

- ప్రభుత్వ ఆసుపత్రిలో ఎంప్లాయిమెంట్ హెల్త్ స్కీం (ఈ హెచ్ ఎస్) పరిధిలో వైద్యం కోసం వచ్చే ప్రభుత్వ ఉద్యోగులకు వీఐపీ చికిత్స అందించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఈహెచ్ఎస్ కింద ఎవరికీ డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ప్రజల్లో మంచిపేరు తీసుకుని వచ్చేందుకు ప్రతి ఒక్కరు బాధ్యతగా పని చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. సమావేశంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్ కుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ పాల్ సుధాకర్, అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులతో ఆరోగ్యం



కొప్పర్రులో మిర్చి పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి రాజకుమారి

పెదనందిపాడు: ప్రకృతి వ్యవసాయంతో పండించిన ఆహార పదార్థాలను తినడం వలన ఆరోగ్యానికి ఎంతో మేలు అని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా అధికారి రాజకుమారి పేర్కొన్నారు. మండల పరిధిలోని కొప్పర్రులో ప్రకృతి వ్యవసాయ పంటలను బుధవారం పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ మిరప 341 రకం పంట పంట దిగుబడి ఆశాజనకంగా ఉందని చెప్పారు. రైతులు పండించిన పంటలను ల్యాబ్‌లో పరీక్షలు నిర్వహించి రసాయన అవశేషాలు 0.0 శాతం ఉంటే వాటికి మార్కెట్ రేటుపై 15 శాతం అదనపు ధరతో కొనుగోలు చేస్తారని వివరించారు. రైతులు ప్రకృతి వ్యవసాయంలో కషాయాలు, ద్రవజీవామృతాలు లాంటివి మాత్రమే పిచికారి చేసి పండించాలని రైతులకు సూచించారు. గోకమ్స్ కంపెనీ మేనేజర్ హిదాయుతుల్లా మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో పండించిన పంటను గత సంవత్సరంలో కొనుగోలు చేశామని, ఈ సంవత్సరం కూడా ఎక్కువ మొత్తంలో సేకరించనున్నట్లు చెప్పారు. రైతులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు ఝాన్సీ, సుమ, ఎంటీలు వరప్రసాద్, వెంకటరమణ పాల్గొన్నారు.

ఏడుగురికి సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతులు

ధ్రువపత్రాలు అందజేసిన జెడ్పీ చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో ఏడుగురు ఉద్యోగులకు సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా పోస్టింగ్ ఆర్డర్లు అందజేశారు. బుధవారం జెడ్పీ క్యాంపు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐదుగురు టైపిస్టులతో పాటు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లకు సీనియర్ అసిస్టెంట్లుగాను, గ్రేడ్ – 1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న అమరేష్‌కు పరిపాలన అధికారిగా ఉద్యోగోన్నతి కల్పించారు. వీరితో పాటు కారుణ్య నియామకం కింద ఒకరికి ఆఫీసు సబార్డినేట్‌గా నియామక ఉత్తర్వులు అందించారు. సీనియర్ అసిస్టెంట్లుగా వీజీవీ రమణ (బొల్లాపల్లి), ఆర్.వేంకటేశ్వరరావు (అచ్చంపేట), ఆర్.అంజిబాబు(రెంటచింతల), రవికుమార్ (ఈపూరు), బి.విజయ్‌కుమార్ (కారెంపూడి), ఆర్.భారతి(వినుకొండ), ఏడుకొండలు(కావల్యాపురం) మండ పరిషత్ కార్యాలయాల్లో సీనియర్ అసిస్టెంట్లుగా ఉద్యోగోన్నతి పొందారు. మంగళగిరి మండలంలో గ్రేడ్ – 1 పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న జి.అమరేష్‌కు ఏపీఐఐసీ కార్యాలయంలో పరిపాలనాధికారిగా ఉద్యోగోన్నతిపై నియమించారు. బక్కా అనూషకు యడ్లపాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఆఫీస్ సబార్డినేట్‌గా ఉద్యోగం కల్పించారు. నరసరావుపేట, మాచవరం, పొన్నూరు, దుర్గి జెడ్పీటీసీలతో పాటు జెడ్పీ ఏ సెక్షన్ అధికారులు పాల్గొన్నారు.

ఆక్రమిత స్థలాన్ని స్వాధీనం చేసుకున్న అధికారులు



గుంటూరు ఈస్ట్: ఆక్రమణలో ఉన్న దేవదాయ, ధర్మాదాయ శాఖకు చెందిన స్థలాన్ని ఆ శాఖ అధికారులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని అరండల్‌పేట 12/1లోని శ్రీరమాసత్యనారాయణ స్వామి దేవస్థానానికి చెందిన 250 చదరపు గజాల స్థలం సుమారు రూ.3 కోట్లు విలువ చేస్తుంది. ఇది అన్యాక్రాంతంలో ఉంది. కోర్టు ఉత్తర్వుల ప్రకారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ బి.మహేశ్వరరెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఆలయ అధికారి జె.శ్రీనివాసరావు, ఇతర అధికారులు జె.సాయి విశ్వనాథ్, నాగలక్ష్మి, విజయ భాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డిలు రెవెన్యూ, పోలీసు అధికారుల సహకారంతో స్వాధీనం చేసుకున్నారు.

తక్కెళ్లపాడులో అమ్మవారికి ప్రత్యేక పూజలు

పెదకాకాని: గంగాభ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామివారి 81వ ఆర్ద్రా మహోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో ఐదు రోజుల పాటు వైభవంగా నిత్యం పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. తొలిరోజు వేకువజామున శుభోదయం, ప్రభాతసేవ, విఘ్నేశ్వర పూజతో పూజా కార్యక్రమాలు ప్రారంభించారు. స్వామివారికి మహన్యాస పూర్వక అర్ద్రాభిషేకం, ఉత్తర ద్వారా దర్శనం, పంచాక్షరి అఖండనామ యజ్ఞ ప్రారంభించారు. అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులను అనుగ్రహించారు. అమ్మవారికి సహస్ర కుంకుమార్చనలు, నామ సంకీర్తనలు జరిపించారు. రాత్రి వేళల్లో సాంస్కృతిక కార్యక్రమా నిర్వహించారు. గురువారం సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల డాక్టర్ గరికపాటి నరసింహారావు శివతత్వం అనే అంశంపై ప్రవచనం చేస్తార ని నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజా మహోత్సవాలు

పాత గుంటూరు: స్థానిక మల్లారెడ్డినగర్ శ్రీ ధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవాలయంలో బుధవారం మండల పూజా మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు అష్టద్రవ్య మహాగణపతి హోమం, నవకలశాభిషేకం నిర్వహించారు. ప్రాంగణంలోని రామలింగేశ్వరస్వామికి ఆరుద్ర నక్షత్రం సందర్భంగా అన్నాభిషేకం, చండీ, నవగ్రహ హోమం, మహా పూర్ణాహుతి వేదమంత్రాల నడుమ విశేషంగా జరిగింది. మాల ధరించిన స్వాములకు, అయ్యప్ప భక్తులకు మండల కాలంగా నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణ ముగింపుగా మహానైవేద్యం, అనంతరం భారీ అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం అయ్యప్పస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. జె.రాము గురుస్వామి ఆధ్వర్యంలో పదునెట్టాంపడి పూజలు స్వామి శరణు ఘోషతో కోలాహలంగా నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ మెట్టు కృష్ణారెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ గుంటూరు వేమారెడ్డి, సీతారామిరెడ్డి తదితరులు పర్యవేక్షించారు.

బహిరంగ ప్రకటన

సం/- ఉయ్యూరు రామమనోహర్, అడ్వకేట్
నం.9014992969, 9030220615.